# సిద్ధంపునగర్ కాలనీ

## ఆంధ్రాస్ ఆర్ కమింగ్ -3

మా కాలనీలో చాలా మంది పిల్లలు ఇంటర్ పరీక్షలు రాశారు. అయితే పరీక్షలు రాస్తున్నప్పుడే వాళ్ళ పరీక్షా ఫలితాలు ఎలా వుంటాయో మాకు తెలిసిపోయాయి. ప్రశ్నాపత్రంలో ఒకటి రెండు ప్రశ్నలు తప్ప మిగతా వాటి గురించి తమ టెక్స్ట్ బుక్స్‌లో ఎక్కడా ఏమీ లేదని, ఉన్నా ఆ పోర్షన్ సిలబస్‌లో లేదని తామనుకున్నామనీ అన్నారు వాళ్ళు.

అయితే తీరా వాళ్ళ ఫలితాలు ఆ రోజు పేపర్లో వచ్చేసరికి కాలనీలో అందరికీ మతులు పోయినంత పనయింది.

అసలు చదవని వాళ్ళకు ఫస్ట్ క్లాస్, కొంచెం చదివిన వాళ్ళకు సెకండ్ క్లాస్, బాగా చదివిన వాళ్ళకు థర్డ్ క్లాస్ వచ్చాయ్.

ఎప్పుడూ డిస్టింక్షన్‌లో పాసయ్యే ఒకే ఒక్క అమ్మాయి మాత్రం తప్పింది.

మా అందరికీ అర్థమయిపోయింది.

"ఇది ఖచ్చితంగా కంప్యూటర్ పనే" అన్నాడు రంగారెడ్డి ఖచ్చితంగా.

"కంప్యూటర్ కాకపోతే ఇంత అవకతవకలుండవ్ — నాకూ అదే అనిపిస్తోంది" అన్నాడు శాయిరామ్.

ఆంధ్రప్రదేశ్ ఇలాంటి అవకతవకలకు ప్రథమ స్థానం వహిస్తున్న విషయం నిజమే అవడం చేత మిగతా వారందరూ కూడా మా అభిప్రాయాలతో ఏకీభవించారు. అయితే హఠాత్తుగా మాకో విషమ సమస్య ఎదురయింది.

అందరూ న్యాయంగా అయితే తప్పాలి గనుక వాళ్ళ భవిష్యత్తు గురించి పెద్దగా ప్లాన్ చేయడానికి ఏమీ లేకపోయింది.

"మళ్ళీ సెప్టెంబర్‌లోనో, మార్చిలోనో పరీక్షలకు కట్టి పాసయినప్పుడు చూద్దాం!" అనుకున్నారు.

ఇంక గత్యంతరం లేక నగరంలోని అన్ని కాలేజీలకు అప్లికేషన్లు గుప్పించాం. మామూలుగానే ఎక్కడా సీటు దొరకలేదు.

ఎవర్నడిగినా బి.ఎ. కలయితే సీటు ఇస్తామంటున్నారు. బి.ఎ. చదివితే ఆ వచ్చే ప్యూన్ ఉద్యోగం కూడా రాదని మాకు తెలుసు.

"బి.కామ్, బి.ఎస్సి. కంప్యూటర్ లాంటివి కావాలంటే ఆంధ్రప్రదేశ్‌లో కుదరదు. మా కర్నాటక వెళ్ళండి" అన్నాడు ఓ కన్నడ ఫ్రెండ్.

"అక్కడ మనకే కోర్సు కావాలంటే అది చదువుకోవచ్చా?" ఆశ్చర్యంగా అడిగాము మేము.

"ఎంట్రెన్స్ కూడా లేకుండా చదువుకోవచ్చు."

"ఎంట్రెన్స్ కూడా లేకుండానా?" మరింత ఆశ్చర్య పోతూ అడిగాము.

"అవును—" మేము ఆశ్చర్యంలో మరింత లోతుకి కూరుకుపోయాము.

"అదే కాదు, ఇంజనీరింగ్, మెడికల్, ఫార్మసీ, పాలిటెక్నిక్, బి.ఇడి., ఏదైనా సరే."

అందరం ఘొల్లున నవ్వేశాం అతని మాటలకు.

"ఏం జోక్ చేస్తున్నావ్‌రా నాయనా! ఎంట్రెన్స్ లేకుండా ఇంజనీరింగ్, మెడికల్, పాలిటెక్నిక్‌లో సీట్లు దొరుకుతాయా?"

మిగతా వాళ్ళందరూ కూడా అతనిని పిచ్చివాడిని చూసినట్లు చూశారు.

"పిచ్చివాక్కాదయ్యా! మీ ఆంధ్రాస్‌కి ఎక్కింది. అడుక్కుతినే రాష్ట్రం! అడుక్కుతినే చదువులు! బోడి సినిమాలు తీయడంలోనే ఫస్ట్ మీరు!" అనేసి కోపంగా వెళ్ళిపోయాడతను.

"ఒకవేళ వాడు చెప్పేది నిజమేనేమో" అన్నాడు గోపాలరావ్ అనుమానంగా.

"ఏద్చావ్! మనక్కావలసిన చదువు చదువుకోవడం ఇండియాలో ఎలా సాధ్యమవుతుంది?" అన్నాడు జనార్దన్. "వాడు చెప్పేది ఇంకేదో దేశం గురించి అయి వుంటుంది—"

"అయితే ఈ కర్నాటక అనేది ఒక వేళ ఎక్కడయినా విదేశాల్లో వుందేమో" అన్నాడు రంగారెడ్డి.

"అవును. ఆ పేరుతో ఇంకెక్కడో ఏదో దేశం వుండి వుంటుంది. లేకపోతే మన దేశంలో మామూలు మిడిల్ క్లాస్ మనుషులకు చదువుకునే అవకాశం ఎందుకుంటుంది?" అన్నాడు శాయిరామ్.

"ఈ కిరికిరంత ఎందుకు భాయ్! జర వరల్డ్ మాప్‌ల చెక్ జేస్తే మంచిగుంటది కద!" అన్నాడు యాదగిరి. ఎవరో ఇంట్లోకి పరుగెత్తుకెళ్ళి మాప్ తీసుకొచ్చారు. అందులో అన్ని దేశాలూ చూశాంగానీ ఎక్కడా కర్నాటక అనేది కనిపించలేదు.

"అయితే ఇది మన దేశంలోని కర్నాటకే అయి వుంటుంది" అన్నాడు గోపాలరావ్ మళ్ళీ అనుమానంగా.

ఈలోగా చంద్రకాంత్ ఛటోపాధ్యాయ ఓ ఇంగ్లీష్ డెయిలీ తీసుకొచ్చాడు.

"ఇది మన పొరుగు కర్నాటక రాష్ట్రమే గురూ! ఇదిగో ఈ పేపర్ నిండా ఆ రాష్ట్రంలోని కాలేజీల ప్రకటనలే! ఎల్.ఎల్.బి., పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఇంజనీరింగ్, మెడిసిన్ అన్నీ వున్నాయక్కడ. మన దిక్కుమాలిన రాష్ట్రంలాగా ఎంట్రెన్స్‌లూ, పిచ్చి రాంకులూ, క్వొశ్చన్ పేపర్లు అవుటయి కొంతమంది రాజకీయ నాయకుల బంధువుల పిల్లలే సెలక్టవటాలూ ఇవేమీ లేవట! కేవలం సెకండ్ క్లాస్‌లో ఇంటర్ పాసయితే, ఇంజనీరింగ్, మెడికల్ రెండింటికీ అప్లయ్ చేసుకోవచ్చు —" న్యూస్ పేపర్లోని ప్రకటనలు చూస్తూ అన్నాడతను.

ఆ రాత్రి మా కాలనీలో చాలా కుటుంబాల్లో ఎవరికీ నిద్ర పట్టలేదు.

"ఏమండీ! మన వాడికి మన రాజధానిలో ఎక్కడా పనికి మాలిన డిగ్రీకి కూడా సీటు దొరకలేదు కదా! వాడిని పోనీ కర్నాటకలో ఇంజనీరింగ్ చేసేద్దాం —" అంటోంది మా పక్కింటావిడ.

"సరే! వాడు ఇంజనీర్ కావాలని వాడి జాతకంలో రాసి పెట్టి వుందేమో! అందుకే మన రాష్ట్రంలో బి.ఎ.కి

యర్రంశెట్టి శాయి

సీటు దొరకలేదు. అంతా మన మంచికే" అన్నాడతను.

రంగారెడ్డి భార్య ఇంకో మెట్టు పైకెళ్లిపోయింది.

"కర్నాటకలో నాలుగేళ్ళ నుంచీ వున్న వాళ్ళ పిల్లలకు కేవలం సంవత్సరానికి ఎనిమిది వేలే ఫీజులండీ — ఇంజనీరింగ్‌లో! అదీ ఎంట్రెన్స్‌లో సెలక్టయితే ఇంకా తక్కువట! మనం కర్నాటకకు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్ళిపోదాం పదండి — మన పిల్లలు పెద్దాళ్ళయే సరికి లోకల్ కాండిడేట్స్ అయిపోతారు—" అంటోందామె.

"కానీ మన రాష్ట్రం నుంచి కర్నాటక రాష్ట్రానికి నాకు ట్రాన్స్‌ఫర్ ఇవ్వరే!"

"అయితే ఈ దిక్కుమాలిన ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగానికి రాజీనామా చెయ్యండి. కర్నాటకలో ఏదొక ఉద్యోగం దొరక్కపోదు—"

ఆటో వాళ్ళందరూ మొఖాలు మాడుకున్నారు.

"వీళ్ళు ఆంధ్రాస్ కాదురా! ఇంకెవరో అయి వుంటారు" అన్నాడొకడు.

"అచ్చం ఆంధ్రాస్ లాగా భలే ఫోజ్ కొట్టార్లే—" అన్నాడు ఇంకొకడు. అందరూ మమ్మల్ని వదిలేసి ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

మేము నడుస్తూ దగ్గర్లో వున్న ఒక లాడ్జికి చేరుకున్నాం.

"మాకు ఆరు డబుల్ రూమ్స్ కావాలి" అన్నాడు రంగారెడ్డి.

"ఎక్కడి నుంచి వచ్చారు మీరు?"

"హైదరాబాద్"

అతను ఆశ్చర్యపోయాడు.

"అంటే మీరు ఆంధ్రాసా?"




మర్నాడు మీటింగ్‌లో కొంతమంది కలిసి కర్నాటకలోని ఇంజనీరింగ్ కాలేజీలకు వెళ్ళి పరిస్థితేమిటో స్వయంగా కనుక్కోవాలని నిర్ణయించుకున్నాం.

హైదరాబాద్‌కు దగ్గరగా వుంది గుల్బర్గా కనుక అక్కడికి చేరుకున్నాం అందరం. రైలు దిగగానే ఆటో వాళ్ళు "ఓరే భాయ్! ఆంధ్రాస్ ఆయేరే! ఆంధ్రాస్ ఆయే" అని అరుచుకుంటూ మా చుట్టూ మూగారు.

"మహంత్ హోటల్ కెళ్ళాలి. ఎంత కావాలి?" అడిగాడు రంగారెడ్డి.

"టూ హండ్రెడ్స్ సర్"

అందరం అదిరిపడ్డాం.

"అంటే నువ్వనేది మా అందరికీ కలిపా?"

"కాద్సార్! ఒక్కో ఆటోకి! అంటే ముగ్గురికి—"

"మరి రెండొందలంటావేమిటి?"

"మీకు రెండొందలే మూలకి సార్! ఒక పూట మందు ఖర్చు లేదు—"

"ఏమిటి? ఒక పూట మా మందు ఖర్చు రెండొందలా? ఏయ్ — సంవత్సరానిక్కూడా అంత ఖర్చవదయ్యా మాకు! మీటర్ రీడింగ్ ప్రకారం వస్తావా రావా?"

"అవును!"

"మరి మీ కార్లేవీ!"

"కార్లా? కార్లేమిటి?"

"ఆంధ్రాస్ అయితే కార్లలో వస్తారు కదా! మీరు ఆంధ్రాస్ కాదు కదూ?"

"ఆంధ్రాసేనయ్యా! అయినా మేమవరయితేనేం? రూమ్స్ వున్నాయా లేవా?"

"ఉన్నాయ్ లెండి! అరే దస్తగిరి! వీళ్ళకు మామూలు రూమ్స్ ఇవ్వరా! ఆంధ్రాస్ ఇంకా రాలేదు. ఈ రాత్రికి వస్తారేమో! ఆ డీలక్స్ రూమ్స్ ఖాళీగానే వుండనీయండి—"

మాకు ఒళ్ళు మండిపోయింది గానీ మధ్యలో తల దూర్చడ మెందుకని ఊరుకున్నాం. త్వరగా రడీ అయి అందరం ఇంజనీరింగ్ కాలేజీకి బయల్దేరాం.

హోటల్ ఆవరణ దాటి రోడ్ మీద కొచ్చేసరికి ఓ కారు రివ్వుమంటూ వచ్చి మాముందాగింది. అందులో నుంచి ఓ సూట్‌వాలా దిగాడు.

"హలో సార్! నమస్తే — ఆంధ్రాస్ కదూ?" చిరునవ్వుతో పలకరించాడు.

"అవును!"

"నేనప్పుడే అనుకున్నాను! వెరీ గ్లాడ్ టు మీట్ యూ! ఇలా పక్కకు రండి!" అన్నాడతను.

పక్కకు ఎందుకు రమ్మంటున్నాడో, అసలతను ఎవరో మాకేం అంతుబట్టలేదు.

ఏం జరుగుతుందో చూద్దామని రోడ్ పక్కనున్న చెట్టుకిందకు వెళ్లి అతని చుట్టూ మూగాము.

"బ్రహ్మాండమైన స్టాండర్డ్ సార్! ఫారిన్ స్టాండర్డ్! కారుచవక! ఎన్ని కావాలి?" అడిగాడతను. మాకు అర్థమయిపోయింది వాడెవరో స్మగుల్డ్ సామాన్లమ్మే వాడని!

వెంటనే సాయిరామ్ కుతూహలంగా అతని దగ్గరకు జరిగాడు.

"జపాన్ వాచీలున్నాయా? ఎలక్ట్రానిక్‌వి"

"పాకెట్ టేప్ రికార్డర్‌లున్నాయా?" అడిగాడు చంద్రకాంత్.

"నాకు త్రీ ఇన్ వన్ కావాలి! దొరుకుతుందా?" అడిగాడు గోపాల్రావ్.

అతను ఆశ్చర్యంగా చూశాడు మావేపు.

"అదేమిటి? నేను స్మగుల్డ్ సామాన్లమ్మే వాడిననుకుంటున్నారా?"

మేము తెల్లబోయాం.

"కాదా? అయితే మరి ఇందాక మీరు దేన్ని గురించి మాట్లాడారు?"

"ఇంజనీరింగ్ అండ్ మెడికల్ సీట్స్ గురించి సార్! అదురుపాటు స్టాండర్డ్ వున్న కాలేజీలు! కారు చవక! ఎన్ని సీట్లు కావాలి?"

మాకు మతిపోయినంత పనయింది.

కర్నాటకలో ఇంజనీరింగ్ కాలేజీలు బోలెడున్నాయని తెలుసుగానీ మరీ ఇంత చవకలో — ఇలా వాళ్ళే మన దగ్గరకొచ్చి సీట్లు అమ్ముతారని తెలీదు.

(ముగింపు వచ్చేవారం)

ఈ కథ పచ్చి అబద్ధం. అసలు ఈ ఇతివృత్తమే అతి దారుణమయిన కల్పితం. ఇందులోని పాత్రలూ, సన్నివేశాలూ, సంఘటనలూ, ప్రదేశాలూ, పోలీసులూ — అన్నీ కథా సౌలభ్యం కోసం కల్పించినవే! ఒకవేళ ఇందులోని చాలా అంశాలు (లేదా అన్ని అంశాలు) మన రాష్ట్రంలోని ప్రజా జీవితాల్ని పోలి ఉన్నట్టయితే అది కేవలం పరమ కాకతాళీయం. ఈ కథలోని సంఘటనలన్నీ తెలుగు రాజధానిలో ఉండవచ్చునని ఎవరికైనా అనిపిస్తే అది వారి భ్రమ మాత్రమే! (ఎందుకంటే మన రాజధాని పౌరులు ఎలాంటి అసౌకర్యాలూ లేకుండా సర్వసుఖాలతో తులతూగుతున్నారు కాబట్టి). ఈ కథలో కొన్ని దిక్కుమాలిన పాత్రలు వెలిబుచ్చిన అభిప్రాయాలతో గానీ, వాడిన దౌర్భాగ్యపు పదజాలంతో గానీ రచయితకు ఎలాంటి సంబంధంగానీ, బాధ్యతగానీ లేదని మనవి.

ఇట్లు

రచయిత